క్లుప్తంగా

పార్టీకి పూర్వ వైభవం తెస్తాం



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న హరిప్రసాద్‌రెడ్డి

పీలేరు : వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం తెస్తామని ఆ పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. పీలేరు మండలం వేపులబైలు పంచాయతీ వరంపాటివారిపల్లెకు చెందిన హరిప్రసాద్‌రెడ్డిని రాష్ట్ర ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతంకోసం అహర్నిషలు కృషి చేస్తానని ప్రకటించారు. తనకు పదవి రావడానికి సహకరించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని కలసి పుష్ప గుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం

మదనపల్లె సిటీ : మదనపల్లెకు చెందిన అక్షర ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు సుధాకర్‌కు సెల్యూట్ అచీవర్స్ సొసైటీ, ఢిల్లీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఎస్వీయూలో పీజీ చేసి విద్యాబోధనపై మక్కువతో అక్షర ఎడ్యుకేషన్ సొసైటీ స్థాపించి పేద పిల్లలు, అనాథ పిల్లలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గౌరవ డాక్టరేట్‌ను విశ్వం కాలేజీ ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల తొలగింపు నిష్పక్షపాతంగా జరపాలి



మాట్లాడుతున్న పునీత్‌కుమార్

మదనపల్లె : ట్రాన్స్‌ఫార్మర్ల తొలగింపు నిష్పక్షపాతంగా జరపాలని బీవైఎస్ అధ్యక్షుడు పునీత్‌కుమార్ కోరారు. గురువారం స్థానిక బీవైఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పునీత్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వస్థలాల్లో ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్ల తొలగించాలని బహుజన యువసేన వినతిమేరకు ఏపీఎస్పీడీసీఎల్, మున్సిపల్ అధికారులు స్పందించి నోటీసులు జారీచేయడం శుభపరిణామమని, అయితే తొలగింపు నిష్పక్షపాతంగా జరపాలని కోరారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు శ్రీనివాసులు, శశికుమార్, హరికుమార్, వినయ్, నితీష్, ఉదయ్, కుమార్, సందీప్, శశి, భాను తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి వేసవి శిక్షణా శిబిరం

మదనపల్లె సిటీ : స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో ఈనెల 28 నుంచి ఉచిత వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి ఆర్. వసంతకుమారి తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. స్పోకెన్ ఇంగ్లీషు, మానవతా విలువలు, యోగ, చిత్రలేఖం తదితర అంశాలపై అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తిగల విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9441527822 నంబరును సంప్రదించాలన్నారు.

కేశాలు దానం చేసిన చిన్నారి



కేశాలు అందజేస్తున్న చిన్నారి

మదనపల్లె సిటీ : క్యాన్సర్ బాధితుల మోములో చిరునవ్వులు చిందించాలన్న లక్ష్యంతో తలపెట్టిన హెయిర్ డొనేషన్ కార్యక్రమంలో భాగంగా మదనపల్లెలోని హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయంలో గురువారం ఓ చిన్నారి కేశాలు దానం చేశారు. పట్టణానికి చెందిన రియాజ్అలీ, సల్మా దంపతుల కుమార్తె నైనా తస్నీన్ హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయానికి వచ్చి కేశాలు దానం చేశారు. హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు చైతు, రష్మిక, చరణ్ పాల్గొన్నారు.

కరాటే బెల్ట్ టెస్ట్ పోటీలు

పీలేరు రూరల్ : స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో జేకేడీ కరాటే కుంగ్‌ఫూ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులకు గురువారం బెల్ట్ టెస్ట్ పోటీలు నిర్వహించినట్లు మాస్టర్ దామోదర్ తెలిపారు. ఈ పోటీల్లో మోక్షశ్రీ, ఫరాజిన్, సఫా బ్లూబెల్ట్, అబ్దుల్, ఉమర్ ఎల్లోబెల్ట్ సాధించినట్లు చెప్పారు. అలాగే ఏడుగురు విద్యార్థులు బ్లాక్ బెల్ట్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులనుఅభినందించారు.

హామీ ఇచ్చారు..అటకెక్కించారు

- ప్రజల్లో 'కూటమి'కి తగ్గుతున్న ఆదరణ
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



వైఎస్సార్‌సీపీ నాయకులతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట : తాము అధికారంలోకి వస్తే బి.కొత్తకోట నగర పంచాయతీ అభివృద్ధిని చేస్తామని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక అటకెక్కించారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి విమర్శించారు. గురువారం బి.కొత్తకోటలో ఆయన విస్తృతంగా పర్యటించారు. పార్టీ మాజీ మండల కన్వీనర్ జాఫర్‌బాషా, కంచి కోదండరెడ్డి నివాసాల్లో పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారం కోసం చేపట్టాల్సిన చర్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి కృషి చేయాలని నాయకులను కోరారు. తమ ప్రభుత్వ హాయంలో అమృత్ పథకం కింద పెద్ద చెరువు అభివృద్ధికి రూ.2.7కోట్లు, తాగునీటి సరఫరా మెరుగు, కొత్త పథకాల కోసం రూ.5.21 కోట్లు నిధులు మంజూరు చేయించగా ఆ నిధులను ఇప్పటికి సద్వినియోగం చేసుకోలేదని తెలిపారు. నోటికొచ్చిన హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో ఆదరణ తగ్గుతోందన్నారు.

సంక్షేమాన్ని విస్మరించిన 'కూటమి'

సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడం పోవడం, రైతు సంక్షేమాన్ని విస్మరించడంపై ప్రజల్లో అసంతృప్తి నెలకొందన్నారు. ఈ పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఇటీవల వివాహమైన జాఫర్ బాషా కుమారుడు, కొడలిని ఎమ్మెల్యే ఆశీర్వదించారు. పదిలో అధిక మార్కులు సాధించిన పట్టణ అధ్యక్షుడు చిన్నికృష్ణ కుమార్తె సంయుక్తను అభినందించారు. మాజీ పట్టణ అధ్యక్షుడు కనకంటి రాజన్న తల్లి ఇటీవల మృతి చెందగా ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. పార్టీ కార్యకర్త సాబు తల్లి ఇటీవల మృతి చెందగా ఇంటికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాగొండ ఖలీల్, మండల కన్వీనర్ నాగన్నగారి ప్రదీప్ కుమార్‌రెడ్డి, హౌస్ బిల్డింగ్ సొసైటి చైర్మన్ బలరాంరెడ్డి, మాజీ ఉపసర్పంచు మాలిక్, కోఆప్షన్ నాసీర్, అయూబ్, అభిలాష్‌రెడ్డి, వెంకటకృష్ణయ్య, రాయల్‌సలీం, ఫయాజ్, మహేష్, ముజీర్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

తంబళ్లపల్లె : కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, అన్ని వర్గాల ప్రజలకు చేసిన మోసాలను ప్రజల్లో ఎండగట్టాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన ఎద్దులవారిపల్లె పర్యటించారు. ఎంపీటీసీ సభ్యురాలు హరిత, కరీముల్లా ఇంట జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందరూ ఐక్యంగా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సర్పంచ్ రెడ్డినారాయణ, వాటర్‌షెడ్ చైర్మన్ నరసింహారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, నాయకులు మల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామమూర్తి, వెంకటేశ్వరరెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారంలో 'కూటమి' విఫలం

మదనపల్లె : రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి తిరుమలప్ప, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్‌కుమార్, నాగరాజు అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జరిగిన యూనియన్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్‌ను రెగ్యులరైజ్ చేసి సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 29 కార్మికచట్టాలను రద్దుచేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్లను తీసుకువచ్చి కార్మికవర్గ హక్కులను విదేశీ, స్వదేశీ పెట్టుబడుదారులకు కట్టబెట్టిందన్నారు. కార్మికవర్గ హక్కులకు ఉరితాడులుగా మారిన నాలుగు లేబర్‌కోడ్లను దేశవ్యాప్తంగా కార్మికవర్గం, రైతాంగం వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా కార్మికసంఘాల ఆధ్వర్యంలో మే20న నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పృథ్వీరాజ్, ముబారక్, వంశీ, నాగరాజు, శ్రీనాథ్, శ్రీనివాసులు, ఉమారాణి, భాగ్యమ్మ, శేఖర్, నందు, శంకర్‌ప్రసాద్, రేణుక, ప్రమీలమ్మ, అనూరాధ, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

సత్యసాయి సేవా స్ఫూర్తే పరమావధి

బి.కొత్తకోట : భగవాన్ సత్యసాయి బాబా చేపట్టిన సేవాకార్యక్రమాలను పరమావధిగా భావించి సేవాస్ఫూర్తితో ముందుకెళ్లాలని సాయిబాబా సేవాసమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ వీవీరెడ్డి సూచించారు. పుట్టపర్తి సత్యసాయి బాబా 14వ వర్ధంతిని గురువారం బి.కొత్తకోటలోని సత్యసాయి మందిరంలో షాజహాన్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు, హారతులతో పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించిన తర్వాత పేదలకు వస్త్రాదానం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీవీరెడ్డి మాట్లాడుతూ ఏటా బాబా వేడుకలను నిర్వహిస్తూ ఆయన్ను స్మరించుకోవడం మానవతా ధర్మమని అన్నారు. బాబా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో షాజహాన్, ఆదినారాయణ, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి అమానుషం



క్యాండిళ్లతో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకులు

పీలేరు : జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అమానుషమని, నిందితులను కఠినంగా శిక్షించాలని పీలేరు బార్ కౌన్సిల్ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి అన్నారు. గురువారం పీలేరు పట్టణంలో బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడిలో అశువులుబాసిన మృతులకు వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనారిటీ నాయకులు క్యాండిళ్లతో నివాళులర్పించారు. గురువారం రాత్రి స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద క్యాండిళ్లతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లావుద్దీన్, సర్పంచ్ హబీబ్‌బాషా, షాకీర్, అబీద్, మునీర్, దావూద్, రియాజ్, ఎమ్మార్పీఎస్ నాయకులు గండికోట వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడికి నిరసనగా బుధవారం రాత్రి నిమ్మనపల్లెలోని బస్టాండ్ కూడలిలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలంటూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు వెంకటరమణ, జనసేన నాయకుడు ప్రదీప్ సింగ్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

నిరసన

కురబలకోట : పహల్గాం ఉగ్రదాడుల దాడిని నిరసిస్తూ గురువారం రాత్రి మండంలోని అంగళ్లు కూడలిలో వివిధ పార్టీల నాయకులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. దాడిలో మృతి చెందిన వారికి ఆత్మ శాంతి కలగాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాలకు కేంద్రం అండగా నిలవాలని కోరారు.

కలికిరి(వాల్మీకిపురం) : పహల్గాం దాడికి పాల్పడిన దోషులను బహిరంగంగా ఉరితీయాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు, కుల మతాలకతీతంగా పహల్గాం ముష్కరుల దాడిని నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. పులి నరేంద్రరెడ్డి, విష్ణు చైతన్య, అబ్దుల్ కలీం, చంద్రమౌళి, వల్లిగట్ల వెంకటరమణ, రాజేంద్రచారి, మల్లికార్జునరెడ్డి, ఆనంద, సయ్యద్ బాషా, రమేష్, ప్రభుచరణ్, వెంకటస్వామి, వీరభద్రయ్య, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు సౌకర్యం కల్పించాలి

మదనపల్లె సిటీ : హజ్ యాత్రికులకు తగిన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు పఠాన్ ఖాదర్‌ఖాన్ కర్ణాటక రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ జనాబ్ జుల్ఫీకర్ అహ్మద్‌ఖాన్‌ను కోరారు. గురువారం ఆయన బెంగుళూరులో హజ్‌హౌస్‌లో కలిశారు. మదనపల్లె పరిసర ప్రాంతాల నుంచి హజ్‌కు యాత్రికులు బెంగుళూరు నుంచి వెళనున్నారన్నారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. దీనికి ఆయన ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన్ను సన్మానించారు.

శుభకార్యాల్లో పాల్గొన్న నిసార్ అహ్మద్



ఎంపీటీసీ రెడ్డిరాణి నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న నిసార్ అహ్మద్

మదనపల్లె : వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ నియోజకవర్గంలో నాయకులకు సంబంధించిన పలు శుభకార్యక్రమాల్లో పాల్గొన్నారు. రామసముద్రం మండలం చెంబకూరుకు చెందిన గయాజ్ కుమారుడు ఎండీ అర్షద్ వివాహ వేడుకలకు హాజరై దంపతులను ఆశీర్వదించారు. వలసపల్లె జ్యూస్ ఫ్యాక్టరీ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వలసపల్లెకు చెందిన నాయకులు మహేశ్వరరెడ్డి కుమార్తె వైధవిరెడ్డి జన్మదిన వేడుకలకు హాజరై చిన్నారిని దీవించి ఆశీస్సులు అందజేశారు. కొత్తవారిపల్లె ఎంపీటీసీ రెడ్డిరాణి నూతన గృహప్రవేశానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, నాయకులు దండాల రవిచంద్రారెడ్డి, హుస్సేని, నూరుల్లా, యూనస్, మహేశ్, ఈశ్వర్‌నాయక్, చరణ్, యాసిన్, అబ్దుల్లా, రామయ్య, మల్లికార్జున, శ్రీరాములు, రఘు, మహేష్, చరణ్, ఖిజ్రీ పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం



అధికారులకు సూచనలిస్తున్న ఎక్సైజ్ కడప జిల్లా డిప్యూటీ కమిషనర్ జయరాజు

కేవీపల్లె : సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి సమిష్టి కృషి అవసరమని ప్రొహిబిషన్, ఎక్సైజ్ కడప జిల్లా డిప్యూటీ కమిషనర్ జయరాజు అన్నారు. గురువారం మండలంలోని జిల్లేళ్లమంద పెద్దతాండాలో ఎక్సైజ్, పోలీస్, రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1,200 లీటర్ల బెల్లం ఊటను నశింపచేసి 15 లీట్ల సారా స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవోదయం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఏప్రిల్ నెలకు సంబంధించి 21 సారా కేసులు నమోదు చేసి 37 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 5,280 లీటర్ల బెల్లం ఊటను నశింపచేయడంతోపాటు 13 మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. నిబంధనలు ఉల్లంఘించిన ముగ్గురు నుంచి రూ. 25 వేలు చలానా రూపంలో కట్టించడం జరిగిందని, 109 మంది అనుమానితులను, పాత నేరస్తులను బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ వై. జోగేంద్ర, ఎక్సైజ్, పోలీస్, రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్'ఫార్మర్' కష్టాలు



నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ (ఫైల్)

కలికిరి : మండల పరిధిలో అద్దవారిపల్లెలో ఈ నెల 18న గాలీవాన బీభత్సానికి ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగి మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. వారం రోజులు గడుస్తున్నా మరమ్మతులు చేయడం లేదని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని స్థానిక విద్యుత్ అధికారికి రైతులు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అయితే సదరు అధికారి సమాధానంతో రైతులు కుంగుతిన్నారు. ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు విరిగిపోతే తానేమి చేయాలని ఆయన రైతులను ప్రశ్నించారు. వారం రోజులు గడుస్తున్నా విద్యుత్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నదాతలు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ గురించి విద్యుత్‌శాఖ అధికారులకు పలుసార్లు ఫోన్ చేసినా వారు ఏమాత్రం స్పందించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కంకీ దశలో ఉన్న పైరు నీటి ఎద్దడి వల్ల చేతికందే పరిస్థితి లేదని, అధికారుల నిర్లక్ష్యమే తమకు శాపంగా మారిందని, తమ గోడు పట్టించుకొనే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్‌లు

కురబలకోట : అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు 19 మందికి పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ జాతీయ స్కాలర్‌షిప్ లభించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. ఎంబీఏ చదువుతున్న ముగ్గురికి రూ.లక్షా యాభై వేలు చొప్పున లభించిందన్నారు. ఎంసీఏ చదువుతున్న మరో 13 మందికి ఒక్కొక్కరికి రూ. 3 లక్షల చొప్పున, మరో ముగ్గురి విద్యార్థులకు రూ.లక్షా యాభై వేలు చొప్పున ఈ స్కాలర్‌షిప్ లభించినట్లు తెలిపారు.

పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతం కావాలి



దేశ నాయకుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ తదితరులు

కురబలకోట : పంచాయతీ రాజ్ వ్యవస్థ మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని కురబలకోట ఎంపీపీ ఎంజి. భూదేవి అభిప్రాయపడ్డారు. పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ బలపడితే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. నేటికి వివిధ గ్రామాల్లో కనీస సౌకర్యాలు కూడా లేవని తెలిపారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సిద్ధించాలంటే ప్రభుత్వాలు స్థిరమైన నిర్ణయాలు అమలు చేయాలని కోరారు. అంతేకాకుండా గ్రామ స్వపరిపాలనలో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడానికి కేంద్ర ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలోకి నెట్టబడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ గంగయ్య, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

నిమ్మనపల్లె : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ, బి.ఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఏప్రిల్ 24వ తేదీన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామాల అభివృద్ధికి పంచాయతీరాజ్ వ్యవస్థ కీలక మన్నారు. ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువలు ఎంజీఎన్‌ఆర్ఇజీఎస్ పథకం నిధులతో నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణారెడ్డి, మారప్ప, గాయత్రి, నాగభూషణం, సరస్వతి, లోకేశ్వరి, గౌతమి, రాజేష్, శ్రీనాథ్, నౌరిన్, మమత తదితరులు పాల్గొన్నారు.

పీలేరురూరల్ : పీలేరు గ్రామ పంచాయతీని స్వర్ణ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుదామని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహాత్మాగాంధీ, డాక్టర్ అంబేడ్కర్ చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈవోపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్, ఈఓ గురుమోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్, వార్డుమెంబర్లు నాగరాజనాయక్, సచిన్, అబీద్, షాజహాన్, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధికే పంచాయతీరాజ్ చట్టం

మదనపల్లె : గ్రామీణాభివృద్ధిని ప్రోత్సహించేందుకు, సామాజిక సాధికారతలో పంచాయతీల పాత్రను ప్రజలకు తెలియజేసేందుకు, బలోపేతం దిశగా కృషిచేసేందుకు పంచాయతీ రాజ్ చట్టం తీసుకురావడం జరిగిందని మండల ఏఓ మస్తాన్‌వలీ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మస్తాన్‌వలీ మాట్లాడుతూ జాతీయపంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఏటా ఏప్రిల్ 24న నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక పాలనా వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించడంలో పంచాయతీరాజ్ సంస్థలు కీలకంగా వ్యవహరిస్తాయన్నారు. భారతరాజ్యాంగంలోని 40వ నిబంధన పంచాయతీరాజ్ సంస్థలను ఏర్పాటుచేయాలని పేర్కొన్నందున, దేశంలో మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ అమల్లో ఉందన్నారు. ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, నాయకులు బెల్లే రెడ్డిప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.